క్లుప్తంగా

దూబచర్లలో అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేతలు

నల్లజర్ల: దూబచర్ల వైఎస్సార్ వసంత్ నగర్‌లో వరసిద్ధివినాయక ఆలయం వద్ద సోమవారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. వినాయక చవితి వేడుకలు ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానంలో సుమారు 1200 మంది పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాడిగడప బాలయ్య, ఉపసర్పంచ్ కాసాని బాటయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు తొమ్మండ్రు రవి, పంది సత్యనారాయణ, చేబ్రోలు బాలాజీ, సీమకుర్తి రాజసింహ, చిన్నారావు, బొర్రాశ్రీనివాస్, పంది శ్రీనివాసరావు,ఎ వర్ధే ప్రసాద్, చేబ్రోలు వెంకటేశ్వరావు, మిద్దే కొండలరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని కోరుతూ వినతి

నల్లజర్ల: రేషన్ డీలర్ల బతుకులు బజారు పాలు చేయవద్దని ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయాన్ని పునఃపరిశీలన చేయాలని కోరుతూ నల్లజర్ల మండల డీలర్లు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుకు సోమవారం సాయంత్రం వినతిపత్రం అందజేశారు. 400 కార్డులకు ఒక రేషన్ షాపు ఏర్పాటు చేస్తామని సివిల్ సప్లయి కమిషనర్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వీరంతా కోరుతున్నారు. ఒక్కో రేషన్ షాపునకు 700 కార్డులు ఉన్నా ప్రభుత్వం ఇచ్చే కమిషన్ షాపు అద్దెలు, కరెంటు బిల్లులు, స్టేషనరీ ఖర్చు, తూకం మెషీన్ల రిపేరు ఖర్చులు పోను నెలకు రూ.8వేలు మిగలడం కష్టంగా ఉందని ఆ సంఘ అధ్యక్షుడు సీమకుర్తి నరసింహమూర్తి ఎమ్మెల్యేకు వివరించారు. 400 కార్డులకు ఒక షాపు కేటాయిస్తే ఆదాయం సగానికి తగ్గిపోతుందన్నారు. ప్రభుత్వం తీసుకున్న నూతన పాలసీ వల్ల డీలర్ల కుటుంబాలు బజారున పడతాయన్నారు

గణనాథునికి పూజలు



మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నిడదవోలు: పట్టణంలో గణేష్‌చౌక్ సెంటర్‌లో ఉన్న శ్రీపూజ గణపతి కుమారస్వామి వారి ఆలయంలో గణపతి నవరాత్ర 102వ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం రాత్రి మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గజమాల, పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు, ముప్పనబోయిన గంగారావు, కారింకి నాగేశ్వరరావు, తోలేటి కోటేశ్వరరావు, లక్కంసాని సూర్యరావు, దుళ్ల మురళి, పట్టణ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

కొవ్వూరు: ఈనెల 17వ తేదీన దొమ్మేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఒకటి నుంచి 19 ఏళ్ల వయస్సు గల బాల, బాలికలు, కిషోర బాలికలకు నులి పురుగుల నివారణలో భాగంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్టు వైద్యాధికారి ఎస్.ధర్మరాజు తెలిపారు. అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండే చిన్నారులందరికీ ఉచితంగా ఈ మాత్రలు అందజేస్తామన్నారు. పీహెచ్‌సీ పరిధిలో 5,381 మంది పిల్లలు ఉన్నట్లు గుర్తించామన్నారు. మంగళవారం ఎవరైనా మిగిలిపోయినట్లయితే వారికి ఈనెల 25వ తేదీన మళ్లీ అందజేస్తామన్నారు.

ఉండ్రాజవరం: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు మంగళవారం నులి పురుగులు నివారణ మాత్రల పంపిణీ చేయనున్నట్టు డాక్టర్ ఆర్ఎస్ఎస్‌వీ ప్రసాద్ సోమవారం తెలిపారు. ఒకటి నుంచి 19ఏళ్ల లోపు వయస్సు గల 6,889 మంది విద్యార్థులకు అందజేయనున్నారు. పిల్లలకు ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు.

200 మందికి వైద్య పరీక్షలు



యర్నగూడెంలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

దేవరపల్లి: పేదల కోసం మెగా ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్టు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు తెలిపారు. దేవరపల్లి మండలం యర్నగూడెంలో ఆర్ కన్వెన్షన్ కల్యాణ మండపంలో యువ పారిశ్రామిక వేత్త పెన్మత్స సుబ్బరాజు ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరం, ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. శిబిరానికి 200 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైద్యశిబిరం మంగళవారం కూడా కొనసాగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పుంతలు ఇలా.. పంట తెచ్చేదెలా?

- అధ్వానంగా మండలంలోని పుంత రహదారులు
- సెస్ రూపంలో మార్కెట్ యార్డుకు రూ.కోటి ఆదాయం
- పుంత రోడ్లను పట్టించుకోని ప్రభుత్వం
- వర్షాకాలంలో అన్నదాతల అవస్థలు వర్ణనాతీతం



నల్లాకులవారి పాలెం వద్ద అధ్వానంగా ఉన్న పుంతరోడ్డు



అన్నవరప్పాడులో బురదగా మారిన శక్తమ్మ పుంత



మల్లేశ్వరంలో గోతులమయంగా పేకేరు పుంత రోడ్డు

పెరవలి: రైతులు పండించిన వివిధ రకాల పంటలపై ప్రభుత్వం సెస్ రూపంలో ఏటా లక్షలాది రూపాయలు వసూలు చేస్తోంది. అయినప్పటికీ వారికి కనీస సౌకర్యాలు కల్పించడం లేదనే విమర్శలు ఎక్కువయ్యాయి. రైతులు తమ పంట భూములకు వెళ్లి వచ్చే పుంతరోడ్లను ప్రభుత్వం నిర్మించడం లేదు. దాంతో వర్షాకాలంలో రైతుల పాట్లు వర్ణనాతీతం. కొన్నిచోట్ల రైతులే స్వచ్ఛందంగా పుంతరోడ్లు వేయించుకున్నారు. వాహనాల రాకపోకలతో చాలాచోట్ల పుంత రోడ్లన్నీ గోతులమయంగా మారడంతో పొలాల నుంచి ఇంటికి వచ్చేందుకు కూడా రైతులు ఇబ్బంది పడుతున్నారు. పొలాల్లో నిత్యం ఉత్పత్తి అయ్యే కూరగాయలు, ఇతర పంటలను మార్కెట్‌కు తరలించేందుకు నానా అగచాట్లూ పడుతున్నారు. గ్రామసభల్లో రైతులు తమ అవస్థలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎక్కడా పట్టించుకున్న దాఖలాలు లేవు. గత టీడీపీ ప్రభుత్వంలో నిర్వహించిన రైతు సదస్సుల్లో పుంతరోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ప్రతి గ్రామసభలోనూ రైతులు డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో కొన్ని గ్రామాల్లో రైతులు ఆ సదస్సులను కూడా బహిష్కరించారు. మార్కెట్ యార్డులు ఉన్నప్పటికీ అవి సెస్‌లు వసూలు చేయడానికే తప్ప తమకే మాత్రం ఉపయోగకరంగా లేవని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం సెస్‌ల రూపంలో రూ.లక్షల్లో వసూలు చేస్తోందని ధ్వజమెత్తుతున్నారు. సౌకర్యాలు కల్పించలేనపుడు సొమ్ములు వసూలు చేయడం ఎంతవరకూ సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు.

ఇదీ పుంతల పరిస్థితి

పెరవలి మండలంలో 162 పుంతరోడ్లు ఉన్నాయి. వాటిలో 18 పుంతలు ఆర్ అండ్ బీ, జాతీయ రహదారులను కలిపే ప్రధానమైనవి. ఈ పుంతరోడ్ల ద్వారానే రైతులు నిత్యం తమ వ్యవసాయోత్పత్తులను మార్కెట్లకు తరలిస్తుంటారు. వాటిలో ప్రభుత్వం ఒక్కపుంత రోడ్డును కూడా నిర్మించలేదు. అక్కడక్కడా రోడ్లతో ఉన్న పుంతలు కూడా రైతులు స్వచ్ఛందగా వేసుకున్నవే. మిగిలిన పుంతలన్నీ ప్రస్తుతం బురదమయంగా ఉన్నాయి. ఇలాంటి మట్టి పుంతల ద్వారా వర్షాకాలంలో వ్యవసాయ ఉత్పత్తులను తరలించడానికి అన్నదాతలు పడుతున్న అవస్థలు ఇన్నీ అన్నీ కావు.

సెస్‌లు ఎంత చెల్లిస్తున్నారు

పెరవలి మండలం నుంచి గతంలో పెనుగొండ మార్కెట్ యార్డుకు సెస్ రూపంలో ఏడాదికి రూ.80 లక్షల ఆదాయం వచ్చేది. నిడదవోలు, తణుకు మార్కెట్ యార్డులకు ఏడాదికి రూ.10 లక్షల చొప్పున ఆదాయం సమకూరేది. జిల్లాల పునర్విభజనతో పెరవలి మండలం నిడదవోలు మార్కెట్ యార్డు పరిధిలోకి మారింది. దాంతో ప్రస్తుతం ఏడాదికి రూ.కోటికి పైగా మొత్తాన్ని మండల రైతులు ఈ మార్కెట్ యార్డుకు సెస్ రూపంలో చెల్లిస్తున్నారు. మార్కెట్ యార్డులు ఇలా సేకరించిన సొమ్ము నుంచి ఒక్క రూపాయి కూడా మండలంలోని పుంతరోడ్ల అభివృద్ధికి కేటాయించడం లేదని రైతుల ఆరోపణ. గత టీడీపీ ప్రభుత్వంలో కానూరు, ముక్కామల, ఖండవల్లి, అన్నవరప్పాడు, ఉసులుమర్రు గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో అధికారులను ఈ పుంతరోడ్ల దుస్థితిపై రైతులు నిలదీశారు. తాము ఫిర్యాదు చేయడమే తప్ప తమ ఇబ్బందులను పట్టించుకున్న నాథుడే కరవయ్యాడని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పట్టించుకుని తగినన్ని నిధులు కేటాయించి పుంత రోడ్లు నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

కలెక్షన్ తప్ప రోడ్లేసింది లేదు



మేం పడించే పంటలపై సెస్‌ల రూపేణా అధికారులు సొమ్ములు వసూలు చేస్తున్నారే తప్ప మాకు అవసరమైన పుంతరోడ్లు మాత్రం వేయడం లేదు. ఈ సమస్యను ఎన్నిసార్లు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా చెవిటి వారి ముందు శంఖం ఊదిన చందమే అయ్యింది.

– మెట్టే సత్యనారాయణ, రైతు, ఖండవల్లి

రైతులకు మేలు చేసేలా పని చేయాలి



రైతుల అవసరాలు చూడలేని ప్రభుత్వం వారి నుంచి సెస్ రూపంలో సొమ్ము వసూలు చేయడం దేనికి? కనీస సౌకర్యాలు కల్పించలేనపుడు రైతులను ఎందుకు ఇబ్బందులకు గురి చేయడం? ఇప్పటికైనా ప్రభుత్వం తన ఆలోచన మార్చుకుని రైతులకు మేలు చేసేలా పని చేయాలి

– వేంద్ర ఏసు, రైతు, ముక్కామల

ఏచూరి పోరాటం స్ఫూర్తిదాయకం



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రిటైర్డు ఉద్యోగుల సంఘం

నల్లజర్ల: భారత కమ్యూనిస్టు పార్టీ(మార్కిస్టు)ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారాం ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ ఉద్యమానికి అందించిన మద్దతు, సహకారం అమూల్యమైందని ఆయన ప్రభుత్వ రంగ సంస్థల ఆప్తమిత్రుడని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగల సంఘ మండల అధ్యక్షుడు ఐవీ సత్యం అన్నారు. నల్లజర్ల జెడ్పీ హైస్కూలులో ఆదివారం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఉన్నమట్ల వెంకటేశ్వరావు,జిల్లా సహాధ్యక్షుడు ఎస్.ఎం. ఆలీ సాహెబ్, జిల్లా కార్యదర్శి ఏసురత్నం, మండల సహాధ్యక్షులు కామేశ్వరావు, కోశాధికారి ప్రభుదాస్, బాలయ్య, కేజేడీవీ ప్రసాద్, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క ఫొటోతో ఎన్నో మధుర జ్ఞాపకాలు



నల్లజర్ల మండల ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంఘ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

నల్లజర్ల: ఫొటోలు ఎన్నో మధుర జ్ఞాపకాలను నిలుపుతాయని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఫొటోగ్రాఫర్స్ సంఘ చైర్మన్ ఎం.రాము అన్నారు. నల్లజర్ల మండల ప్రొఫెషనల్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంఘ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం అచ్చన్నపాలెంలో కాకర్ల గంగరాజు కల్యాణ మండపంలో సోమవారం జరిగింది. తొలుత కెమెరా సృష్టికర్త లూయిస్ డాగ్యురే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ ఫొటోగ్రాఫర్ రామును సత్కరించారు. నూతన కార్యవర్గం గౌరవ అధ్యక్షుడు యజ్జవరపుగాంధీ, అధ్యక్షుడిగా యడ్లపల్లి నిరంజన్, ఉపాధ్యక్షుడిగా కె.సుబ్బారావు, కార్యదర్శిగా చంద్రరావు, కోశాధికారిగా డి.శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా కె.గోపాలకృష్ణ, శ్రీనివాసరావు, సింగ్‌దాస్, మౌళిచంద్‌లతో జిల్లా అధ్యక్షులు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు షబ్బీర్, ఏలూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సూరిబాబు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



క్యాన్సర్‌తో బాధపడుతున్న విద్యార్థికి ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సభ్యులు

తాళ్లపూడి: గత కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న చిడిపి గ్రామానికి చెందిన విద్యార్థి బట్టు రాజ్ వర్ధన్ వైద్య ఖర్చులకు మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ.16,500 ఆర్థికసాయం అందజేశారు. రాజ్ వర్ధన్ ప్రస్తుతం పెద్దేవం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. మానవత సంస్థ రూ.6వేలు, ఆ సంస్థ సభ్యులు కవల శ్రీను రూ.5 వేలు, పాలడుగుల లక్ష్మణరావు రూ.వెయ్యి వాసిబోయిన చంద్రయ్య రూ.వెయ్యి, తుంపూడి గుప్తా రూ.500, యేసుబాబు రూ. రెండు వేలు చిడిపి గ్రామస్తుడు రూ.వెయ్యి, సాయన సుబ్బారావు 25 కేజీల బియ్యం ప్యాకెట్ అందజేసినట్టు సంస్థ అధ్యక్షుడు అంకెం సురేష్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజనరల్ చైర్మన్ వి.చంద్రయ్య, సనపల రాజశేఖర్, అప్పన వీరహనుమంతరావు, కొప్పాక వెంకటేశ్వరరావు, పెమ్మాడి దుర్గాప్రసాద్, వల్లభనేని వీర్రాజు, జోడాల వెంకటేశ్వరరావు, చెరకు ఆంజనేయులు, గంధం మునేశ్వరరావు, అడదాడి వెంకటేష్, ప్రత్తిపాటి అబేద్నెగో తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీపోత్సవం

కొవ్వూరు: గణపతి నవరాత్రి వేడుకల్లో భాగంగా పట్టణంలో 23వ వార్డు రౌండ్ రామాలయం యూత్ ఆధ్వర్యంలో స్వామివారి మండపం వద్ద సోమవారం రాత్రి దీపోత్సవం నిర్వహించారు. మహిళలు, కమిటీ యువకులు పాల్గొని 1,008 దీపాలు వెలిగించారు. అంతా శివన్నామ స్మరణతో మార్మోగింది. కమిటీ యువకులు దీపోత్సవంలో పాల్గొన్నారు.

దొండపూడిలో ఉచిత వైద్యశిబిరం



దొండపూడిలో రోగులకు మందులు అందజేస్తున్న వైద్యులు, సిబ్బంది

గోపాలపురం: దొండపూడిలో శ్రీవలియనీడు నెల్సన్ ఆంటోని జన్మదినాన్ని పురస్కరించుకొని టైటిన్ ఆఫ్ చారిటబుల్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేసినట్టు నిర్వాహకులు జె.శేఖర్‌బాబు చెప్పారు. అనంతరం వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో దొండపూడి గ్రామ సర్పంచ్ మల్లిపూడి అచ్చిబాబు, ఎంపీటీసీ మారాజు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం బౌద్ధ ధమ్మ పీఠంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. బౌద్ధ బిక్షువు బంతె అనాలియో ఆధ్వర్యంలో వేమగిరి శ్రీ పరమహంస యోగనంద నేత్రాలయం నుంచి వచ్చిన కంటి వైద్యులు సుమారు 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 18 మందికి ఆపరేషన్లు, 38 మందికి కళ్లజోళ్లు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి కళారావు, మల్లిన శ్రీనివాసరావు, గంటా వెంకట్రావు, చిట్టూరి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

18, 19 తేదీల్లో ఆటల పోటీలు

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గ స్థాయి క్రీడాకారుల ఎంపిక ఆటల పోటీలు ఈ నెల 18, 19 తేదీల్లో దేవరపల్లి, దుద్దుకూరు జిల్లా పరిషత్ హైస్కూల్స్ క్రీడా మైదానాల్లో నిర్వహిస్తున్నట్టు ఎంపీఓలు తిరుమలదాస్, అప్పారావు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించి నియోజకవర్గ స్థాయి జట్లు ఎంపిక చేయనున్నట్టు ఆయన తెలిపారు. అండర్–14, 17 విభాగాల్లో బాలికలు, బాలుర జట్లు ఎంపిక జరుగుతుందన్నారు. ఇక్కడ ఎంపికైన జట్లు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటాయని తురుమలదాస్ తెలిపారు. 18న దేవరపల్లిలోని అంబటి సత్యనారాయణరావు జిల్లా పరిషత్ హైస్కూల్లో అథ్లెటిక్స్, యోగా, చెస్, షటిల్, బ్యాడ్మింటన్‌లో క్రీడాకారుల ఎంపిక ఉంటుందన్నారు. 19న దుద్దుకూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని ఆయన చెప్పారు.

ఘనంగా మిలాద్-ఉన్-నబీ



పట్టణంలో ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లింలు

నిడదవోలు : పట్టణంలో తాలిముల్ ఖురాన్ మదర్స్ కమిటీ ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం మీలాద్ –ఉన్ –నబీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి సెంటర్‌లో ఉన్న మదర్సా నుంచి ముస్లిం ర్యాలీగా బయలు దేరారు. పట్టణంలో ప్రధాన సెంటర్ల మీదగా ర్యాలీ సాగింది. ఈకార్యక్రమంలో మదర్సా అధ్యక్షుడు ఎండీ మజాహద్, సయ్యద్ రోషన్, జహీర్, అక్రం, ఫిరోజ్, హసీఫ్, ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి గణేశుడు



చాగల్లు తెలగా సంఘం కళావేదిక వద్ద రోషన్‌లాల్ ఆర్కెస్ట్రాలో పాటలు పాడుతున్న సినీ గాయని సత్యయామిని



కొవ్వూరులో నిమజ్జనోత్సవంలో భాగంగా ప్రత్యేక వాహనంపై తరలుతున్న వినాయకుడి ఊరేగింపు



గోపాలపురంలో లక్ష్మీగణపతిని ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు



వేగేశ్వరపురంలో గోదావరిలో వినాయక నిమజ్జనం చేస్తున్న దృశ్యం

- కోలాహలంగా వినాయక విగ్రహాల నిమజ్జనం
- కేరింతలతో యువత సందడి

నిడదవోలు: పట్టణంలోని బసిరెడ్డిపేటలో ఉన్న పశ్చిమడెల్టా ప్రధాన కాలువ రేవులో సోమవారం గణేష్ నిమజ్జనోత్సవం కోలాహలంగా నిర్వహించారు. భక్తుల విశేష పూజలు అందుకున్న గణనాథుడు తల్లి గంగమ్మ ఒడికి చేరుకుంటున్నాడు. పట్టణంలో వినాయక చవితి పర్వదినం సందర్భంగా వాడవాడలా వినాయక విగ్రహాల ఏర్పాటు చేసిన భక్తులు తొమ్మిది రోజుల పాటు భక్తితో పూజలు చేశారు. అనంతరం గణనాథుని విగ్రహాలను యువత కేరింతల మధ్య ఊరేగింపుగా తీసుకొచ్చి కాలువ రేవులో నిమజ్జనం చేశారు. పట్టణంలో వివిధ సెంటర్లలో ఏర్పాటు చేసిన సుమారు 12 విగ్రహాలను క్రేన్ సహాయంతో కాలువలో నిమజ్జనం చేశారు. నిడదవోలు సీఐ వి.శ్రీనివాసరావు, పట్టణ ఎస్సై పి.శోభన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొవ్వూరు: వినాయక చవితి వేడుకలు ముగింపు సందర్భంగా సోమవారం వినాయక విగ్రహాల నిమజ్జనాలు కన్నుల పండుగలా సాగింది. పట్టణంలో పోతురాజు దిబ్బ, డీఎస్పీ కార్యాలయం వద్ద రక్షక గణపతి, పదో వార్డు, 11వ వార్డుల్లోను, 18వ వార్డు యనాద కాలనీ వద్ద వినాయక శిబిరాల వద్ద వేలాది మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 22వ వార్డు కౌన్సిలర్ కంతమణి రమేష్‌బాబు పోతురాజు దిబ్బ శిబిరం వద్ద ఏర్పాటు చేసిన 18 కిలోల లడ్డూని రూ.58,116 లకు దక్కించుకున్నారు. పదో వార్డులో బీజేపీ నాయకుడు పిక్కి నాగేంద్ర రూ.21వేలకి లడ్డూని దక్కించుకున్నారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథాలపై స్వామివారి ఊరేగింపు అట్టహాసంగా నిర్వహించారు. అనంతరం గోష్పాదక్షేత్రంలోని గోదావరి నదిలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి

చాగల్లు : గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా తెలగా సంఘం కళావేదిక వద్ద రోషన్‌లాల్ ఆర్కెస్ట్రాతో సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. గాయకులు పలు హుషారైన పాటలతో ప్రేక్షకులను అలరించారు. పసందైన పాటలు పాడుతూ యువతను ఆకట్టుకున్నారు. సంగీత విభావరిని తిలకించడానికి పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో జనం తరలివచ్చారు. ఉత్సవ ఏర్పాట్లను కమిటీ నిర్వాహకులు గండ్రోతు సురేంద్రకుమార్ పర్యవేక్షించారు. వర్తకసంఘం కళావేదికపై కురుక్షేత్రం నాటకం ప్రదర్శించారు. నిర్వాహకులు గ్రంధి రాంబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రూ.51 వేలు పలికిన లడ్డూ

గణపతి నవరాత్ర ఉత్సవాలు ముగింపు సందర్భంగా చాగల్లులో స్వామివారి లడ్డూ ప్రసాదానికి వేలం నిర్వహించారు. తెలగా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి గుడి వద్ద 101 కిలోల లడ్డూను రూ.51 వేలకు గ్రామానికి చెందిన నలుగురు భక్తులు దక్కించుకున్నట్టు ఉత్సవ కమిటీ నిర్వాహకులు గండ్రోతు సురేంద్రకుమార్ తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల గౌరవాధ్యక్షుడు జుట్టా కొండలరావు పాల్గొన్నారు.

సందడిగా నిమజ్జనాలు

తాళ్లపూడి: మండలంలోని వినాయక విగ్రహాల నిమజ్జనాలు సోమవారం ఘనంగా జరిగాయి. ట్రాక్టర్ పై వినాయక విగ్రహాలను పెట్టి డోలు సన్నాయి, కోలాటం, డీజే సౌండ్, తీన్‌మార్ నృత్యాలతో ఊరేగించారు. తాళ్లపూడిలోని బస్టాండ్ సెంటర్ గణపతి యువజన సంఘం ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహన్ని బండ్లపై ఊగించారు. వేగేశ్వరపురం, ప్రక్కిలంక తదితర గ్రామాల్లో గణేశ్ విగ్రహాల నిమజ్జనాలు జరిగాయి.

చాగల్లు : గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు గ్రామాల్లో ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాలు సోమవారం ఘనంగా నిర్వహించారు.చాగల్లులో తెలగా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఊనగట్ల, ఎస్.ముప్పవరం, బ్రాహ్మణగూడెం, దారవరం, గరప్పాడు గ్రామాలల్లో నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి.

గోపాలపురం: స్థానిక లక్ష్మీ గణపతి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణేష్‌మహారాజ్‌ను ట్రాక్టర్‌పై ఊరేగించి తాళ్లపూడి గోదావరిలో నిమజ్జనం చేశారు. లక్ష్మీదుర్గా టాక్సీస్టాండ్ వద్ద భారీ అన్నసమారాధన చేశారు. లక్ష్మీ గణపతి ఆలయం వద్ద స్వామి లడ్డూ వేలం నిర్వహించగా రూ.36,200లకు గోపాలపురం గ్రామానికి చెందిన పైడి మర్ల సత్తిరెడ్డి దక్కించుకున్నారు.

కళాకారులను గౌరవించడం సంతోషకరం

చాగల్లు: వినాయ కచవితి సందర్భంగా కళలను, కళాకారులను గౌరవించడం సంతోషకరమని వర్ధమాన సినీ గాయని సత్యయామిని అన్నారు. గణపతి నవరాత్రులు సందర్భంగా చాగల్లు తెలగా సంఘం ఆధ్వర్యంలో జరిగిన సంగీత విభావరిలో పాల్గొని ఆమె పసందైన పాటలు పాడి యువతను ఉర్రూతలూగించారు. ఈ సందర్భంగా ఆమె తెలగా సంఘం వినాయకుడి ఆలయంలో స్వామి వారికి పూజలు చేశారు.చాగల్లు ప్రజలు కళాప్రియులని కళాకారులను ఆదరించి బాగా ప్రోత్సాహిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గండ్రోతు సురేంద్రకుమార్, జుట్టా కొండలరావు, అనిశెట్టి సూర్యం, పిండి మంగరాజు తెలగా సంఘం పెద్దలు ఉన్నారు.